మహేశ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హుస్సేన్ నాయక్

దోషులను కఠినంగా శిక్షించాలి

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్

గార్ల, నవంబర్ 16: మండలంలోని సీతంపేటకు చెందిన గుమ్మడి మహేశ్ హత్యకు కారణమైన దోషులను కఠినంగా శిక్షించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ అన్నారు. శనివారం మహేశ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తమ కుమారుడి హత్య కేసులో మరో ముగ్గురు ఉన్నారని, వారిని రిమాండ్ చేసి కఠినంగా శిక్షించాలని మృతుడి తల్లి వీరకుమారి తెలిపారు. ఈ సందర్భంగా హుస్సేన్‌నాయక్ డీఎస్పీతో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారా..? కేసు నమోదైతే రూ.8లక్షలు ప్రభుత్వం నుంచి ఇప్పించారా? అని ప్రశ్నించగా, కేసుకు సంబంధించిన ఫైల్స్ కలెక్టర్ కార్యాలయానికి పంపించినట్లు డీఎస్పీ తెలిపారు. వెంటనే కలెక్టర్‌కు ఫోన్ చేసి అడుగగా, తమ వద్దకురాలేదని చెప్పడంతో పోలీసు అధికారులు హత్య కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని సూచించారు. బాధితులకు వెంటనే పరిహారం వచ్చేవిధంగా కృషి చేస్తామని, మహేశ్ తమ్ముడు రాజుకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని హుస్సేన్‌నాయక్ తెలిపారు. ప్రధాన నిందితుడైన వీరభద్రాన్ని పోలీసులు తప్పించి, కేసును తప్పుదోవ పట్టిస్తున్నారని కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. మహేశ్ కుటుంబానికి న్యాయం చేయాలని ఆదివాసీ నాయకులు కోరారు. కార్యక్రమంలో ఎస్‌వీఎస్ కన్వెన్షన్ అధినేత గోదాల అభిలాశ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గుండెబోయిన నాగమణి, నాయకులు పాల్గొన్నారు.

చదువుతోనే బంగారు భవిష్యత్

బయ్యారం: చదువుతోనే బంగారు భవిష్యత్ లభిస్తుందని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్ అన్నారు. మండలంలోని నామాలపాడు ఏకలవ్య పాఠశాలను ఆయన శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. తరగతి గదులు, మరుగుదొడ్లు, భోజనశాలను పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం పాఠశాలలో నీటి వసతి, ప్లేగ్రౌండ్ లేదని తెలుపడంతో అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జాతీయ ఎస్టీ కమిషన్ హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ అశోక్‌కుమార్, వైస్‌ప్రిన్సిపాల్ ధనరాజ్, సిబ్బంది అనిల్ యాదవ్ ఉన్నారు.

చేపల వేటలో విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి

శ్రీను (ఫైల్)

పెద్దవంగర, నవంబర్ 16: చేపల వేటలో విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి ఘటన మండలంలోని వడ్డేకొత్తపల్లి పరిధిలోని భీముని తండాలో శనివారం జరిగింది. ఎస్సై క్రాంతికిరణ్ కథనం ప్రకారం.. తండాకు చెందిన గుగులోత్ శ్రీను (50) వడ్డేకొత్తపల్లి పెద్ద చెరువు సమీపంలోని ఓ నీటిగుంతలో కరెంట్ సహాయంతో చేపలు పడుతున్న క్రమంలో షాక్ రావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గ్రూప్-3 పరీక్షలకు సర్వం సిద్ధం

కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

తొర్రూరు: వెలికట్ట శివారులోని సెయింట్‌పాల్స్ పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 16: ఈ నెల 17, 18 తేదీల్లో జరగనున్న గ్రూప్-3 పరీక్షల నిర్వహణకు జిల్లాలో సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 7,592 మంది అభ్యర్థులు పరీక్షలకు రాయనున్నారని, ఇందుకోసం 21 సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 21 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, 29 మంది జిల్లా స్థాయి ప్రత్యేక అధికారులు, 15 మంది ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కేంద్రాల్లో అన్నిరకాలా వసతులు కల్పించామని, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని, కేవలం హాల్‌టికెట్, ఐడీ ప్రూఫ్ కోసం ఆధార్ కార్డ్‌ను వెంట తీసుకురావాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టోప్పో, జిల్లా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తొర్రూరు డివిజన్‌లో 8 సెంటర్లు..

తొర్రూరు: గ్రూప్-3 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్, తొర్రూరు డీఎస్పీ కృష్ణకిశోర్ అన్నారు. శనివారం తొర్రూరు సర్కిల్‌లోని 8 పరీక్షా కేంద్రాలను వారు పరిశీలించి మాట్లాడారు. సర్కిల్ పరిధిలో 8 కేంద్రాల్లో 3,364 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్లు ప్రతి సెంటర్‌ను విజిట్ చేసి సీసీ కెమెరాలు, అవసరమైన ఏర్పాట్లతో పాటు విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. 17న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. 18న మధ్యాహ్నం పరీక్ష ఉంటుందన్నారు. బయోమెట్రిక్ విధానం ద్వారా వేలిముద్రల సేకరణ ప్రక్రియ చేపట్టాల్సి ఉన్నందున అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. చీఫ్ సూపరింటెండెంట్‌కు తప్ప మరెవరికీ కేంద్రంలోకి మొబైల్ ఫోన్ అనుమతి లేదన్నారు. సెంటర్లలోకి ఫోన్, పుస్తకాలు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు తీసుకువెళ్లేందుకు అనుమతి లేదని, ప్రతి కేంద్రం వద్ద క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ జగదీశ్, ఎస్సై ఉపేందర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రేపు 'ప్రజావాణి' రద్దు

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 16: కలెక్టరేట్‌లో ఈ నెల 18న నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్-3 పరీక్ష, సమగ్ర కుటుంబ కులగణన సర్వే నేపథ్యంలో ప్రజావాణిని రద్దు చేశామని, ప్రజలు గమనించాలని సూచించారు.

విదేశాల్లో చదువులకు ఉచిత శిక్షణ

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 16: తెలంగాణ రాష్ట్ర మైనార్టీస్ స్టడీ సర్కిల్, మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో విదేశాల్లో చదువుల కోసం ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఈనెల 30 వరకు తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్ హైదరాబాద్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 040-23236112 నంబరులో సంప్రదించాలన్నారు.

దవాఖానల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 16: ప్రైవేట్, కార్పొరేట్ దవాఖానల్లో ఫీజుల దోపిడీని వెంటనే అరికట్టాలని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కందాల రంగయ్య అన్నారు. శనివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వైద్యవిధానం పూర్తిగా సమస్యలకు నిలయంగా మారిందన్నారు. నిరుపేదలకు సరైన వైద్యం సకాలంలో అందడంలేదని, దీనిని ఆసరాగా చేసుకొని ప్రైవేట్ దవాఖాన యాజమాన్యాలు పేదల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో రాంప్రసాద్, స్వామి, ప్రవీణ్, లింగస్వామి, రాజు పాల్గొన్నారు.

చోరీలపై అప్రమత్తంగా ఉండాలి

డోర్నకల్/కేసముద్రం, నవంబర్ 16: మండలంలో ఇటీవల తరచుగా చోరీలు జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ భూక్యా రాజేశ్ అన్నారు. శనివారం డోర్నకల్ పోలీస్ స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటికి తాళం వేసి చెవిని కిటికీల మీద, గోడలపై పెట్టకుండా, నగదు, విలువైన వస్తువులను జాగ్రత్తగా భద్రపర్చుకోవాలని, తాళాలు తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. అదేవిధంగా మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతూ.. ఊర్లకు, ఇంటికి తాళం వేసి వెళ్లేటప్పుడు ఇరుగు, పొరుగు వారికి సమాచారం ఇవ్వాలని సూచించారు.

'విశ్వబ్రాహ్మణులను వర్గీకరించొద్దు'

నెల్లికుదురు, నవంబర్ 16: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కులగణన సర్వేలో విశ్వబ్రాహ్మణుల ఉపకులస్తులను వేరు చేయడం సరికాదని సంఘం మండల నాయకుడు పత్తిపాక తిరుపతిచారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కమ్మరి, వడ్రంగి, ఇత్తడి, శిల్పి, కంసాలి కులస్తులందరూ విశ్వబ్రాహ్మణులనే కులగణనలో పొందుపర్చాలన్నారు. ప్రత్యేక రిజర్వేషన్స్‌తో పాటు బడ్జెట్ కేటాయించాలని కోరారు.

ప్రభుత్వ ఆఫీస్‌లను ఏర్పాటు చేయాలి

ఇనుగుర్తి, నవంబర్ 16: ఇనుగుర్తి మండలానికి ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని కోరుతూ శనివారం భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ కేసముద్రం మండల కన్వీనర్ మర్రిపెల్లి మొగిలి ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ ఆకుల రవికి వినతిపత్రం అందించార. ఈ సందర్భంగా మొగిలి మాట్లాడుతూ అనేక పోరాటాల ఫలితంగా ఆవిర్భవించిన ఇనుగుర్తి మండలానికి వెంటనే పోలీస్‌స్టేషన్, ఎంపీడీవో, విద్యాశాఖ కార్యాలయాలతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల దవాఖానగా మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు. బిచ్చానాయక్, పఠాని, రాజీర్, అంజయ్య పాల్గొన్నారు.

మిర్చిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

గార్ల, నవంబర్ 16: మండలంలోని చిన్న బంజర, పుల్లూరు గ్రామాల్లో మిర్చి తోటలను జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల శనివారం పరిశీలించారు. కోయనోఫార, కొమ్మ కుళ్లు వ్యాధులను గుర్తించారు. రైతులు మేలైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని, రైతులు క్రిమిసంహారక, కలుపు మందులు పిచికారీ చేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏవో రామారావు, ఏఈవో పూజిత, రైతులు పాల్గొన్నారు.

గడ్డిమందును నిషేధించాలి

మహబూబాబాద్ రూరల్: గడ్డిమందును నిషేధించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు అన్నారు. శనివారం జిల్లా వ్యవసాయ అధికారి విజయ నిర్మలను కలిసి వినతిపత్రం అందజేశారు. మనుషుల ప్రాణాలను, భూసారాన్ని హరిస్తున్నదని, ప్రతి ఏడాది వందల సంఖ్యలో ప్రజలు మృతిచెందుతున్నారని తెలిపారు. జీవన విధ్వంసానికి కారణమైన గడ్డి మందును వెంటనే నిషేధించాలని కోరారు.

గార్ల: మిర్చితోటను పరిశీలిస్తున్న డీఏవో విజయనిర్మల

నర్సింహులపేట: రాంబాబుకు వీల్‌చైర్ అందిస్తున్న రఘు

రాంబాబుకు వీల్ చైర్ అందజేత

నమస్తే ఎఫెక్ట్

నర్సింహులపేట/మహబూబాబాద్ రూరల్, నవంబర్ 16: మండలంలోని కూరపాటి రాంబాబు 15 ఏళ్లుగా లేవలేని స్థితిలో మంచానికి పరిమితమయ్యాడు. దీంతో నమస్తే తెలంగాణ దినపత్రికలో 'అభయ హస్తం కోసం ఎదురు చూపు' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన దాతలు శనివారం రాంబాబుకు వీల్‌చైర్ అందజేశారు. అమెరికాకు చెందిన సూర్య తమన్న యూట్యూబర్ గంగరబోయిన రఘు ద్వారా వీల్‌చైర్ అందించారు. పేదరికంలో ఉన్న ప్రజల కోసం తనవంతు సాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యాకన్న, కార్తిక్, వీరన్న, దయాకర్ ఉన్నారు. అదేవిధంగా మహబూబాబాద్ మండలంలోని లక్ష్మీపురం (బి)గ్రామానికి చెందిన నిరుపేద వృద్ధురాలు కంది చంద్రమ్మ జీవనాధారం లేకుండా మంచానికి పరిమితమవడంతో గ్రామానికి చెందిన కొందరు విషయాన్ని యూట్యూబర్ రఘుకు తెలిపారు. ఆయన స్పందించి ఇన్‌స్టాగ్రామ్ ఆధారంగా చంద్రమ్మకు వీల్‌చైర్, 25కిలోల బియ్యం అందించాడు. రఘు మానవత్వం చూసి గ్రామస్తులు అభినందించారు.

రైస్ మిల్లులను వేలం వేయాలి : సీపీఐ

సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

కురవి, నవంబర్ 16: ప్రభుత్వానికి చెందిన వేలాది టన్నుల బియ్యాన్ని కాజేసి రూ.కోట్లు దండుకున్న రైస్ మిల్లర్ల యాజమాన్యంపై క్రిమినల్ కేసు పెట్టి, రికవరీ చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వకుండా మన జిల్లాలో రూ.55 కోట్ల విలువ చేసే వేలాది టన్నుల ధాన్యాన్ని అమ్ముకున్న మిల్లర్లపై తూతూ మంత్రంగా కేసులు పెట్టి చేతులు దులుపుకోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా దృష్టి సారించి మిల్లర్లపై రెవెన్యూ రికవరీ యాక్ట్ నమోదు చేసి ఆస్తులను జప్తు చేయాలని డిమాండ్ చేశారు. కొత్త రేషన్‌కార్డులు, ఆసరా పెన్షన్లు, రైతు భరోసా, రుణమాఫీ వంటి సంక్షేమ పథకాలను మాటలతో దాటవేయకుండా ఆచరణలో వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి కరణం రాజన్న, దంతాలపల్లి మండల కార్యదర్శి పోలేపాక వెంకన్న, మరిపెడ మండల బాధ్యులు ఎండీ రషీద్, కలగూర నాగరాజు, బుర్ర సమ్మయ్య, తురక రమేశ్, అప్పాల వెంకన్న పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన కాంగ్రెస్

డోర్నకల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు

డోర్నకల్, నవంబర్ 16: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి రాగానే కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విస్మరించిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్ వీరయ్య అన్నారు. సీపీఎం జిల్లా 3వ మహాసభల సందర్భంగా శనివారం డోర్నకల్‌లోని ఎన్టీఆర్ విగ్రహం నుంచి రైల్వేస్టేషన్, బిషప్ అజరయ్య ఫంక్షన్‌హాల్ వరకు కళాకారులు డప్పు చప్పుళ్లు, పాటలు, నృత్యాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలతో మోసం చేసి అధికారంలోకి వచ్చిందని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతాలు, కులాల మధ్య చిచ్చుపెట్టి రెచ్చగొడుతున్నట్లు పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలు ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్, జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు శెట్టి వెంకన్న, గునిగంటి రాజన్న, సోమయ్య, ఆకుల రాజు, అల్వాల వీరయ్య, కందునూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యుడు అశోక్, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడు మృతి



సూరయ్య(ఫైల్)

ఇనుగుర్తి, నవంబర్ 16: గుండెపోటుతో బీఆర్‌ఎస్ నాయకుడు మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఇనుగుర్తికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు ఓరుగంటి సూరయ్య(55) తన కారులో గ్రామానికి చెందిన భక్తులను శుక్రవారం వేములవాడకు తీసుకెళ్లి రాత్రి భోజనం చేసి కారులోనే పడుకున్నాడు. శనివారం భక్తులు ఫోన్‌చేస్తే ఎత్తకపోవడంతో వెళ్లి చూడగా విగతజీవిగా ఉన్నాడని, గుండెపోటుకు గురై మరణించినట్లు తెలిపారు. సూరయ్య తెలంగాణ ఉద్యమంలో తనదైన శైలిలో చురుకుగా పాల్గొన్నాడని, ఆయన మృతి బీఆర్‌ఎస్ పార్టీకి తీరనిలోటని స్థానికులు పేర్కొంటున్నారు. మృతుడికి భార్య భారతమ్మతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కులగణన సిబ్బందికి పారితోషికం ప్రకటించాలి

తొర్రూరు, నవంబర్16: కులగణన సర్వేలో విధులు నిర్వర్తిస్తున్న ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, సిబ్బందికి పారితోషికం విషయంలో ప్రభుత్వం స్పష్టమై న జీవో విడుదల చేయాలని ఎ స్టీయూ జిల్లా అధ్యక్షుడు కొరవి సుధాకరచారి డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వే ప్రారంభమై 10 రోజులు అవుతున్నా నేటికీ సిబ్బందికి పారితోషకం ఎంత ఇస్తారో జీవో విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం కులగణన సర్వే గడువు పొడిగించి ఎన్యుమరేటర్లపై ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీ నివేదికను తెప్పించుకొని వెంటనే అమలు చేయాలన్నారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యాకూబ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు తండాల చంద్రప్రకాశ్‌గౌడ్, రవి, రాజు, రాజేశ్వర్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 16: రాష్ట్రంలోని ముదిరాజ్‌ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ముదిరాజ్ జిల్లా మహాసభ అధ్యక్షుడు చిల్లా సహదేవ్ అన్నారు. శనివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఈ నెల 21న జరిగే ప్రపంచ ముదిరాజ్ మహాసభల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం బీసీల జనాభా ఆధారంగా వారికి రిజర్వేషన్ విధానం కల్పించాలన్నారు. అభయహస్తంలో పేర్కొన్న విధంగా ముదిరాజ్, తెనుగోళ్లను బీసీ-ఏలో చేర్చాలన్నారు. చెరువులు, కుంటల్లోని మత్స్య సంపదపై ముదిరాజ్‌లకే హక్కులు ఉండేలా చట్టాలు రూపొందించాలన్నారు. మత్స్య పారిశ్రామిక జిల్లా సహకార సంఘాల చీఫ్ ప్రమోటర్ కొత్తూరు రమేశ్, గుండా వెంకన్న, జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వ ర్, జిల్లా కార్యదర్శి ధనుంజయ్, పిడుగు వెం కన్న, రమేశ్, ఉపేందర్ పాల్గొన్నారు.

ట్రాక్టర్, కారు ఢీ.. ముగ్గురికి తీవ్రగాయాలు

పెద్దవంగర, నవంబర్ 16: ట్రాక్టర్, కారు ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన మండల కేంద్రంలోని వలిగొండ-తొర్రూరు ప్రధాన రహదారిపై తహసీల్దార్ కార్యాలయం సమీపంలో శనివారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. పెద్దవంగర గ్రామానికి చెందిన ట్రాక్టర్ ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తీసుకొని తొర్రూరు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారును అదుపు తప్పి ఎదురుగా ఢీకొని పక్కనే ఉన్న మరో బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ముగ్గురికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై క్రాంతికిరణ్ సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను తొర్రూరులోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు.

ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తా

ఎంపీ బలరాంనాయక్

స్వామికి పూజలు చేస్తున్న ఎంపీ బలరాంనాయక్

కేసముద్రం, నవంబర్ 16: మండలంలోని అయ్యప్పస్వామి ఆలయంలో అభివృద్ధి పనుల కోసం రూ.50లక్షల నిధులు మంజూరు చేయిస్తానని ఎంపీ బలరాంనాయక్ అన్నారు. ఆలయంలో శనివారం నుంచి మాలధారులకు చేయనున్న అన్నప్రసాద వితరణను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామికి పూజలు చేసి అనంత రం మాట్లాడారు. భోజనశాల నిర్మాణానికి రూ.25 లక్షలు, పదునెట్టంబడి మెట్లపై హైడ్రాలిక్ షెడ్ నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరు చేయిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అల్లం రమ, నాయకులు ఉన్నారు.

డిసెంబర్ చివరి నాటికి పూర్తి రుణమాఫీ



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం, నవంబర్ 16: ఈ డిసెంబర్ చివరి నాటికి రైతు రుణ మాఫీని పూర్తి స్థాలో అమలు చేస్తామని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ అన్నారు. శనివారం ధన్నసరి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. తేమశాతం తక్కువగా ఉన్న ధాన్యాన్ని విక్రయానికి తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. చెత్త, తాలు లేకుండా చూసుకోవాలని, సన్నరకం వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నామని తెలిపారు. అనంతరం అయ్యప్పస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ మర్రి రంగారావు, సింగిల్ విండో వైస్‌చైర్మన్లు అల్లం నాగేశ్వరరావు, అంబటి మహేందర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

హాస్టల్‌లోకి వెళ్లేందుకు గుర్తు తెలియని వ్యక్తుల యత్నం..!

విచారణ చేపట్టిన పోలీసులు

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 16: ఓ బాలికల హాస్టల్‌లోకి గుర్తు తెలియని వ్యక్తులు వెళ్లేందుకు ప్రయత్నించినట్లు సమాచారం శనివారం వెలుగులోకి వచ్చింది. మానుకోటలోని బాలికల హాస్టల్‌లోకి ఐదు రోజుల క్రితం రాత్రిపూట గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించడానికి ప్రయత్నించారని, ఈ క్రమంలో తాగునీటి కోసం లేచిన విద్యార్థులు వారిని చూసి భయపడి కేకలు వేశారని తెలిసింది. మరుసటి రోజు తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వగా, వారు పాఠశాల ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు పోలీసులకు తెలుపగా, పోలీసులు, అధికారులు విచారణ చేపట్టినట్లు తెలిసింది. ఈ ఘటనపై జిల్లా హాస్టళ్ల పర్యవేక్షణ అధికారి విజయకుమారిని వివరణ కోరగా.. హాస్టల్‌కు వెళ్లి వాచ్‌మెన్, కేర్‌టేకర్, ఏఎన్ఎంల నుంచి వివరాలు తెలుసుకున్నామని, పూర్తి నివేదికను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 16: వ్యాసరచన ద్వారా విద్యార్థులకు సృజనాత్మకత అలవడుతుందని మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజు గంటసేపు గ్రంథాలయానికి వచ్చి విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శ్రీలత, లైబ్రేరియన్లు విజేందర్, రవి, భూలక్ష్మి పాల్గొన్నారు.

మధుసూదన్‌రెడ్డికి రెడ్యానాయక్ పరామర్శ

నర్సింహులపేట, నవంబర్ 16: మండలంలోని వంతడపల మాజీ సర్పంచ్, రైతుబంధు మండల కన్వీనర్ యల్లు మధుసూదన్‌రెడ్డికి ఇటీవల గుండెకు సంబంధించిన శస్త్రచికిత్స జరగడంతో ఇంట్లో విశ్రాంతి తీసుకుటున్నాడు. శనివారం మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ ఆయనను పరామర్శించారు. బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి కుంభం సుధీర్‌రెడ్డి, బాలు, సంజీవరెడ్డి, కిషన్‌రావు, భీష్మ ఉన్నారు.

బురాన్‌పురంలో పట్టపగలే చోరీ

8తులాల బంగారం, రూ.5వేల నగదు అపహరణ

మరిపెడ, నవంబర్ 16: మండలంలోని బురాన్‌పురం గ్రామంలో శనివారం పట్టపగలే చోరీ జరిగింది. గ్రామానికి చెందిన బాధితుడు పెద్దబోయిన ఐలమల్లు మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి పనిమీద బయటకు వెళ్లాడు. సాయంత్రం వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉన్నట్లు గుర్తించి లోపలి వెళ్లి చూడగా బీరువాలో దాచిన 8తులాల బంగారపు హారం, రూ.5వేల నగదును దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. వెంటనే మరిపెడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. సీఐ రాజ్‌కుమార్‌గౌడ్, ఎస్సై సతీశ్ ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్‌టీంతో వేలుముద్రలను సేకరించినట్లు సీఐ తెలిపారు.

శ్మశాన వాటికకు తాళం

- రోడ్డుపైనే దహన సంస్కారాలు
- బిల్లులు చెల్లించలేదని గుత్తేదారు నిర్వాకం

కుమ్మరికుంట్లలో రోడ్డుపైనే నిర్వహిస్తున్న దహన సంస్కారాలు

దంతాలపలి, నవంబర్ 16: ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించడం లేదని ఓ గుత్తేదారు శ్మశాన వాటికకు తాళం వేయడంతో ప్రజలు రో డ్డుపైనే దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గత బీఆర్‌ఎస్ ప్రభు త్వం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఊరూరా శ్మశాన వాటికలను నిర్మించింది. దంతాలపల్లి మండలం కుమ్మరికుంట్ల గ్రామంలో శ్మశాన వాటికను నిర్మించిన గుత్తేదారు సకాలంలో ఎంబీ రికార్డును అధికారులకు సమర్పించకపోవడంతో అతడికి బిల్లు రాలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ఇప్పటి వరకు బిల్లును చెల్లించలేదు. దీంతో సదరు గుత్తేదారు శ్మశానవాటికకు తాళం వేశాడు. దీంతో గ్రామంలో ఎవరైనా మృతి చెందితే రోడ్డుపైనే అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్నారు. తాజాగా శనివారం ఓ గ్రామస్తురాలు అనారోగ్యంతో మృతి చెందగా రోడ్డుపైనే దహనం చేయడంతో అటుగా వెళ్లిన బాటసారులు, రైతులు ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్మశానవాటికను తెరిపించి ఇబ్బందులు కలుగకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS — నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326503

WANTED TELECALLERS

jobs Apply Now!

★URGENT REQUIREMENT for ICICI HDFC AXIS INDUSIND BANK'S DSA PERSONAL LOANS EXPERIENCE AND FRESHER FEMALE TELE-CALLERS SALARY+INCENTIVESJOB LOCATION: HANAMKONDA, CONT: +91 9398286149.
NTW-7705

WANTED HOSPITAL STAFF

★Operation Theater Boys, Medical Shop Assts. & Computer Operators/Administrators /Supervisors Required Cont: Guardian Hospital, Mulugu 'X' Road, Wgl. 12 to 2 pm
NTW-450

WANTED

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-338958-All

TO-LET

★Commercial Building 3 Floors + Penthouse for Rent, Beside Akshaya Hotel, Jangaon. Ph: 8099573388.
NT-98831

RENT

★3 floors building for rent, each floor has 3600sqft Ground floor for parking place available, opp:ASM DEGREE & PG WOMENS COLLEGE,Fort Road Warangal M: 9849987808/8309884828.
NTW-17373

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం: 9182777552

HANAMKONDA 9182777563 9182777961
WARANGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565